

*తొలి చూపులలోనే కొందరిమీద ఇష్టం, మరికొందరిమీద అయిష్టం ఏర్పడతాయి. ఏవిధంగా పరిశీలించినా సమర్థనీయమైనది కాదీ భావన. మానవ స్వభావమే అంత అని సరిపెట్టుకోనూలేము. ఏమైనా అది నిజం. ఎదుటివారి హృదయం అర్థం చేసుకొన్న తరువాత అయినా తొలి భావానికి స్వస్తి చెప్పడం అవసరం కాదా ?*

---

"ఈ పుటలు తిరగవేస్తుంటే నేను వేలవంగా కనిపిస్తానేమోనని భయం.

నా హృదయం అర్థమయ్యేవరకు నన్నిలా జ్ఞాపకముంచుకొన్నా ఆనందమే. తరువాత మీతో పాటు నేనూ బాధపడవలసి వస్తుంది.

విజ్ఞానమే కాదు, అజ్ఞానము కూడా మనిషికి అందమనుకుంటా !

ఢక్కాముక్కీలు తింటే మనిషి రాటు తేల్తాడు.

నేను మీకెవర్నో కాని, మీరు నా కెన్నడైనా కావలసినవారే.

మీ

శచీదేవి."

కొందరిమీద తొలిచూపుల్లోనే నాకు అయిష్టం ఏర్పడుతుంది. దానికి కారణం ఫలానా అని నేను చెప్పలేను. కాని దానిని ఎంత పోగొట్టుకొందామన్నా నావల్లకాదు. వారితో నా పరిచయం కొన్ని ఘడియలే కావచ్చు. లేక కొన్ని సంవత్సరాలే కావచ్చు. వారిని నేనెన్నడూ ప్రేమించలేను ; గౌరవించలేను. వారు మంచివారే అగుగాక; సున్నితహృదయులే అగుగాక; వారియెడల నా హృదయ మెందుకో కాఠిన్యం వహిస్తుంది. అది నాలో బలహీనమని నాకు తెలుసు — కాని దానిని నేను పోగొట్టుకోలేకుండా ఉన్నాను. ఈ లోపమే నన్నప్పుడప్పుడు పిచ్చివాణ్ణి కూడా చేస్తుంది.


ఏమీ తోచక నా పాత పుస్తకాలన్నీ దులుపుతున్నాను. కొన్నింటిని పురుగులు తినేశాయి. కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. ఇంతలో వాటి నుంచి ఆటోగ్రాఫ్ పుస్తకమొకటి కింద పడ్డది. ఆతృతతో దానిని చూడసాగాను. అందులో శచి వ్రాసిన పై వాక్యాలు నా కంట పడ్డాయి. శచిని నేను మరిచిపోలేను. నా జీవితాంతము నన్ను వెంటాడుతూనే ఉంటుంది. శచి వ్రాసిన ఆ వాక్యాలు నా హృదయంలో తుఫాను రేపసాగాయి. పైన ఉదహరించిన వ్యక్తులలో శచికూడా ఒకర్తె కావడమే నా దురదృష్టము.

• • •

"సీ కెంట్ తీటా— దట్— కెన్ బి ఎలిమినేటెడ్ ఫ్రమ్ ది ఈక్వేషన్. . ."

"ఇక్కడ ఈ పీరియడ్ మాకు క్లాసుంది. దయచేసి వెళ్తారా" అంటూ వచ్చింది ఒక అమ్మాయి, మరి కొందరితో కలసి.

సాధారణంగా మా లీజరు అవర్సులో నలుగురైదుగురం కలిసి ఏదన్నా ఖాళీ క్లాసులో కూర్చుని ప్రాబ్లమ్సు చేసుకొంటాము. అలాగే ఆ రోజు కూడా. అప్పుడు నేను చేస్తున్నాను. అలా అన్న వ్యక్తి వైపు చూద్దును కదా నాకు భలే కోపం వచ్చింది. లెఖ్ఖ మంచి పట్టులో ఉంది.



అత్తలూరి గంగాధర రావు

న్యాయంగా మేము అక్కణ్ణించి వెళ్ళవలసిందే. కాని పెద్దవాళ్ల క్లాసులో మొగపిల్లలెవరూ లేనట్లు తనే బలగంతో రావాలా?

"సరే, పదవోయ్ శేఖరం. తరువాత చూడొచ్చులే దాని పని" అంటూ ద్వంద్వార్థముతో మాట్లాడాడు మా సుబ్బారావు. ఇహ అక్కడినుంచి పోక తప్పిందికాదు.

అదే మొదలు నేను శచిని చూడటం. అప్పుడు ఫోర్త్‌యురు. మాథమేటిక్సు చదువుతున్నాను నేను. శచి థర్డియరు ఫిజిక్సుట. ఆ పరిస్థితుల్లో నా మూడ్సు అలా ఉండటంవల్ల శచిని నేను గౌరవించలేకపొయ్యానేమో. నిజానికి శచి చాలా మంచిది. అందమైనది. శచికోసం ఎందరో తాపత్రయపడ్డారు. కాని వాళ్ళకు సరియైన సమాధానం చెప్పేది.

తరువాత శచితో నాకు ఎంతో సాన్నిహిత్యం ఏర్పడ్డది. అయినా నేను శచిని సరిగా చూడలేకపొయ్యాను. దానికి కారణం ఏమిటి? అది నాలో బలహీనత.

నేనూ, 'మనూ' కలిసి బ్రాడీపేటలో ఒక మేడమీద రెండు గదులు అద్దెకు తీసుకొని వుంటున్నాము అప్పుడు. 'మనూ' మా బాబాయి కూతురు. ఆ యేడే ఫస్టియరు ఎమ్. బి. లో చేరింది. నాకంటే రెండు రోజులు చిన్నట.



ఆనందం  ఫోటో—ప్రభాకర్ మహాదిక్ (బొంబాయి-28)

# చంచల హృదయం

'మనూ' నన్ను అప్పుడప్పుడు "అన్నయ్యా" అంటుంది. తనకు ఏదన్నా కావలసివస్తే "శేఖరం, నీవు మంచివాడివి కదూ" అంటుంది. కోపమొస్తేమటుకు "ఏరా, వెధవా" అంటుంది మహంకాళిలా పోజుపెట్టి. మేము అన్నా చెల్లెళ్ల కన్నా స్నేహితులుగానే మెలిగేవాళ్లము.

"శేఖరం, నువ్వు ఈ సంవత్సరంతో వెళ్లి పోతావు కదా, మరి తరువాత నేను ఎక్కడ ఉండనురా" అంది పాపం నేను ఫోర్తియరులోకి రాగానే.

"ఏం, హాస్టలులో చేరుదువుగాని" అంటే "పోరా, నాకు హాస్టలంటే మహా చిరాకు" అనేది. కాని తరువాత హాస్టలులోనే చేరింది విధిలేక.

శచి వాళ్ల నాన్నగారికి కడప నుంచి గుంటూరుకు ఆ యేడే ట్రాన్స్ఫరయింది. అందుకే బి. ఎస్‌సి. లో ఇక్కడ చేరింది. వాళ్లు మేము ఉంటున్న ఇంటిప్రక్కనే మకాం పెట్టారు.

శచిని చూస్తున్నప్పుడల్లా నాకు తేళ్లూ జెర్రులూ పాకినట్లుండేది ఒంటినిండా.

ఆ రోజు ఆదివారం. 'మనూ' లోపల గదిలో పేషెన్సు ఆడుతూంది. నేను నా ప్రాబ్లమ్సుతో కుస్తీ పడుతున్నాను.

"ప్లీజ్, ఎక్స్‌క్యూజ్ మీ" అంటూ విన వచ్చాయి నాకు మాటలు.

అసలే ప్రాబ్లమ్సు రాక చస్తూంటే మరీ చిరెత్తించాయి నాకా మాటలు.

తలెత్తి చూద్దును కదా — థర్డియరు ఫిజిక్సు అమ్మాయి పదరు మా పక్కింటి అమ్మాయి కుమారి శచీదేవి. ఏమిటన్నట్లు చూశాను.

"మరండీ, మీ గులాబీకి జంట పూలు పూశాయి. నాకు జంట గులాబీలంటే చచ్చే ఇష్టం. ప్లీజ్, కోసుకోనిస్తారా" అంది జాలిగా మొహం పెడుతూ.

హతోస్మి. ఇప్పుడేమిటి మన తక్షణ కర్తవ్యం అనుకున్నాను. ఆ గులాబీ చెట్టును పెంచింది నేను కాదు. 'మనూ' కు గులాబీలంటే ఇష్టం — అందుకని తొట్టెలో చంటి పిల్లవాడిలా పెంచుతుంది వాటిని. పూలు ఇవ్వడం నా కేమాత్రం ఇష్టంలేదు — కాని మర్యాదవిపించక—

"జస్టె మినిట్. 'మనూ' ఇలా ఒక సారి రా" అన్నాను.

"ఆగరా. మంచి పట్టులో ఉంది" అంది 'మనూ' లోపలి నుంచి.

"నా బొందలా వుంది. రమ్మంటే."

కోపంతో కాళిలా "ఏంటెరా" అంటూ వచ్చిందల్లా బయట ఉన్న నూతన వ్యక్తి (రోజూ ఒకర్ని ఒకరం చూసుకోవడం తప్ప అంతవరకు మాట్లాడి ఎరగం)ని చూసి సిగ్గుపడి—

"ఓ, మీరా, రండి. ఇలా కూర్చోండి. ఏరా, శేఖరం, వచ్చిన వ్యక్తిని కూర్చోమనడం కూడా చేతకాదా" అంది నా వైపు చూస్తూ.

అప్పుడు తెలిసింది నాకు — శచి వాకిట్లోనే నించొని ఉందని. అయినా కూర్చోమనవలసిన అవసరం నాకు లేదు. వచ్చిన పనిని చెప్పుకుంది శచి 'మనూ' కు.

దీనికి మటుకు బుద్ధి ఉండొద్దూ ? "దానికేముంది తీసుకోండి" అంటూ తనే స్వయంగా వెళ్లి కోసి తీసుకొచ్చి ఇచ్చింది. ఆ జంట గులాబీలను చూడగానే తొందరగా (ఎవరన్నా కాజేస్తారేమోనని భయమేమో) తీసుకొని ముద్దెట్టుకుంది శచి. కొత్తవారము మేము ఉన్నాము కదా మరీ అంత. . .ఏమిటో. కాని ఆ గులాబీ ఎక్కువ ఎరుపో లేక ఆ పెదవు లెక్కువ ఎరుపో తెలియలేదు నాకు.

"ఏమండీ ! మీ సుబ్బారావు ఒట్టి గడయిలా ఉన్నాడే" అంది శచి.

"ఆ ! పోకిరీ పిల్లల్ని చూస్తే వాడంతేలెండి" అన్నాను.

పాపం ముఖం మాడ్చుకుంది. అయినా మర్యాదగా మాట్లాడలేదు నేను.

అప్పటినుంచీ శచికి, మా "మనూ" కు బాగా స్నేహం ఏర్పడ్డది. రోజూ శచి మా రూమ్సుకు వచ్చేది. శచి చాలా అల్లరిపిల్ల. ఏవేవో కబుర్లు చెప్పేది. అటువంటి కబుర్లు నేను చెప్పలేనే అని ఉక్రోషం నాకు.

ఒక రోజు "నాకు మాథ్సు ఏమీ అర్థం కావడంలేదండీ. అందులో ఆ కాలుకలస్ అసలు రాదు. కాస్త నాకు చెప్తారా" అంది.

నాకు భలే కోపం వచ్చింది. ఎందుకంటే ఆ రోజు నేను క్లాసులో లెక్క చేస్తున్నప్పుడు

నా మాటలు పట్టుకొని నాకు 'సీకెంటుతీటా' అనిపేరు పెట్టింది తను. మరి ఇప్పుడు వెక్కిరించడానికే ఆ ఎత్తు ఏమోనని.

"మీరు ఫిజిక్సులో జీనియస్‌టగా" అన్నాను. "కాని నాకు మాథ్సు రావండీ. ఆనబసిడరీలు తీసేసి మెయిను ఒకటే ఉంటే బాగుండు నని పిస్తుంది నాకు" అంది శచి.

నిజమే, కాలుకలస్ అసలు రాదు శచికి. దాంతో శచిని నేను తెగ ఏడిపించేవాడిని. ఒక్కొక్కప్పుడు నా వెక్కిరింపు మాటలు విని శచికి కళ్లవెంట నీరు కూడా వచ్చేది.

"నీకు మానర్సు తెలీవురా. పాపం రావనే కదా నీ దగ్గరకు వచ్చేది. చెప్పడం మానేసి ఏడిపిస్తావేం" అంది 'మనూ' శచి వెళ్లిన తరువాత ఒకరోజు.

నిజమే, తప్పే. కాని....ఆ 'కాని'కి నాకు సమాధానం దొరికేదికాదు. ఆ రోజుమంచీ బాగానే చెప్పసాగాను. శచిది చాలా సూక్ష్మబుద్ధి. ఒక మారు చెప్తే ఇట్టే గ్రహిస్తుంది. అలా చెపుతున్నప్పుడు—అనవసరంగా మాట్లాడేవాడిని కాదు. అది శచికి చాలా ఇరకాటంగా ఉండేది. అందుకు శచి "ఏమిటి మాట్లాడటమే మానేశారు" అంది.

"ఇది మరీ బాగుంది, నేను ప్రాబ్లమ్సు నోరుమూసుకొని చెపుతున్నా ననుకుంటున్నారా!" అన్నాను.

సెకండ్ టరము అయిపోయింది. పబ్లిక్కు ఎగ్జామ్సు దగ్గర పడుతున్నాయి. ఫిబ్రవరిలోనే ప్రిపరేషన్ హాలీడేస్ ఇచ్చేశారు. మా 'మనూ' ఎప్పుడూ చదువును సీరియస్‌గా తీసుకోదు. దాని ఇష్టముంటే చదువుతుంది; లేకపోతే లేదు. శచికి ఒక్క ఇంగ్లీషే కాబట్టి ఆడుతూ పాడుతూ చదివేది. కాని నాకు గుండె అదురుతూంది.

హఠాత్తుగా వార్నింగు లేకుండా జ్వరం వచ్చింది నాకు. మొదటి రెండు రోజులు నిర్లక్ష్యం చేశాను. మూడోనాడు నూటనాలుగు డిగ్రీలు వచ్చింది. అంత ఎండల్లో కూడా చలితో వణికి పొయ్యాను. ఏదో పిచ్చి పిచ్చిగా కలవరించే వాణ్ణట. "శచి లేకపోతే నీకు నయమయ్యేది కాదురా. డాక్టరు మందులకన్నా శచి సేవే నిన్ను కాపాడింది" అంటే శచి సిగ్గుతో ముడుచుకొని పోయింది.

కాని శచివల్ల నా జ్వరం తగ్గిందంటే నాకు నచ్చలేదు. "ఏం కాదు. జ్వరం వస్తే ఎన్నాళ్ళు ఉంటుం దేమిటి? అదే తగ్గింది" అన్నాను మొండిగా.

చాటుగా శచి కన్నీరు తుడుచుకోవడం నేను చూడకపోలేదు. అయినా నా హృదయం కరగలేదు. లేదనడానికి వీల్లేదు. శచి వెళ్లిన తరువాత ఎంతో బాధపడ్డాను—అలా ఎందుకన్నానా అని. "నేను నీకేం అపకారం చేశానని, శేఖరం, నన్ను ఇలా పురుగును చూసినట్లు చూస్తావు? నాలో ఏంలోపం ఉంది? చెబితే దిద్దుకుంటాను" అని శచి అడిగితే ఏం జవాబు చెప్పాలో నాకు తెలీదు. కాని....ముందే చెప్పానుగా ఆ 'కాని'కి సమాధానం లేదు.

" 'శచీ! నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని నాకు తెలుసు. నువ్వు నాదానివే, శచీ. నువ్వు నాదానివే' అని కలవరించేవురా ఒకనాడు. నిజం చెప్పరా, శచి అంటే నీకు ఇష్టంలేదూ!" అంది 'మనూ.'

"నోర్మూయి. నీకేం పిచ్చా; ఒకవేళ కలవరించానే అనుకో. కలవరింపు నిజమా" అన్నాను.

పరీక్షలు అయిపొయ్యాయి. అందరిచేత ఆటోగ్రాఫ్సు పెట్టించుకొన్నాను. రూములో కూర్చుని నేనూ, 'మనూ' ఎవరు ఏమని వ్రాశారో చూస్తున్నాము. ఇంతలో శచి తను ఒక కొత్త ఆటోగ్రాఫ్ పుస్తకం పట్టుకొచ్చి నా కిచ్చింది అందులో వ్రాయమని.

నాకు వ్రాయడం ఇష్టంలేదు— అయినా 'మనూ' ఏమంటుందోనని ఊరికే సంతకం పెట్టాను. శచి ముఖంలో బాధ నాకు స్ఫురించక పోలేదు. అయినా అది అంతే. తిరిగి నా పుస్తకం ఇవ్వకపోవడం భావ్యంకాదని (భావ్యము కాదో అవునో అనేదానికంటే 'మనూ' ఏమంటుందోనని) ఇచ్చాను.

అప్పుడు వ్రాసింది ఆ వాక్యాలను శచి. వ్రాసి అక్కడ నిలబడలేక పోయింది పాపం శచి. కన్నీరు ఆపుకోలేక పరుగెడుతూ వెళ్లిపోయింది— ఆ పుస్తకాన్ని బల్లమీద పెడుతూ.

తరువాత నేను గుంటూరు వదిలి వెళ్లిపోయాను.

"... శచికి వాళ్లవాళ్లు పెళ్లిచేశారు. నిజానికి ఆ పెళ్లి శచికి ఇష్టంలేదు. అయినా చేసుకుంది. నువ్వు శచిపట్ల అలా ఎందుకు ప్రవర్తించావో నాకు అర్థంకాలేదు. నాకు ఒక



భోజనాల వేళ (హిమాచలప్రదేశ్ కొండజాతి వనిత)
ఫోటో — ప్రసాద్ (ఢిల్లీ-6)

సహృదయుడైన అన్న ఉన్నాడని ఎంతో మురిసి పొయ్యేదాన్ని. నాకు తోబుట్టువులు ఎవరూ లేకపోయినా నిన్నుచూసి తృప్తిపడేదాన్ని. కాని నీకు హృదయం లేదని ఈనాడు తెలిసింది....''

అంటూ ఉత్తరం వ్రాసింది 'మనూ'.

నాది ఏదో పోగొట్టుకున్నవాడిలా ఫీలయ్యాను. శచిని నేను ప్రేమించాను— నాకు తెలుసు— అది నగ్నసత్యం. శచి నాకు ఏమి అన్యాయం చేసిందని ఆ శిక్ష తనకు? అది నాకు తెలియదు. తెలియదనడం పొరపాటు. అలా చెప్పుకోవడం నా హృదయ దౌర్బల్యం మాత్రమే.

ఒకసారి ఏదో పని ఉండి గుంటూరు వెళ్లాను. 'మనూ' అక్కడే హౌసు సర్జనుగా పని చేస్తూంది.

"శచి పురిటి కొచ్చిందిరా. పోయినసారే చాలా బాధపడ్డది. కాని పుట్టిన పిల్లాడు రెండు గంటలు కూడా బ్రతకలేదు. ఈసారి ఎలా అవుతుందో'' అంది 'మనూ'.

శచే వచ్చింది నన్ను చూడటానికి. ఏదో పాపం చేసిన వాడిలా బాధపడ్డాను శచిని చూసి. కాని శచి సరదాగానే మాట్లాడింది. ఎన్ని అగ్ని గుండాలనైనా భరిస్తుంది శచి. కాని ఆ ముఖంలో చిరునవ్వు తొలిగిపోనీయదు. కాస్త చిరాకుగా కనపడ్డా మళ్లీ ఇట్టే మారిపోతుంది.

"పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు'' అంది శచి.

"పెళ్లి! ఈ ప్రపంచంలో జనాభా తక్కువయిందనా నాకు పెళ్లి'' అన్నాను.

నాకు తెలుసు ఆ మాటలు శచికి వజ్రఘాతాలని. బాధతో ఓర్పుతో తలవంచుకుంది శచి. ఆ ఓర్పులో మారోవంతయినా నాలో ఉంటే బాగుపడేవాడినేమో.

"యూ బ్రూట్'' అంది 'మనూ' కోపంతో.

"ఊరుకో 'మనూ'. శేఖరం మనస్తత్వమే అంత. అది అతనిలో లోపంకాదు. సరే వస్తాను శేఖరం—ఈ దీనురాలిని మరిచిపోకు'' అంటూ వెళ్లిపోయింది శచి.

"శేఖరం మనస్తత్వమే అంత.'' నిజం చెప్పావుశచీ. నేను నిన్ను అంత బాధపెట్టినా నన్ను క్షమించావు. నన్ను అర్థం చేసుకున్నది నీవే నేమో. నేను పరమ పాతకుణ్ణి—అయినా ఇప్పుడు చేయగలిగింది ఏమీలేదు.

"ఇహ ఈ జన్మలో నీకు బుద్ధి రాదురా. ఎందుకు చదువుకున్నావు? ఛీ'' అంది 'మనూ'.

శచి ఈసారి గట్టెక్కలేకపోయింది. ఈ లోకాన్నే శాశ్వతంగా విడిచిపోయింది. నాలో వేదన ఎవరికి చెప్పుకోను? చెప్పినా ఎవరు నమ్ముతారు?

"ఇప్పుడు హాయిగా ఉందా? శచి ఉసురు నీకు తగలకపోదు. నీవు మటుకు ఏం సుఖపడతావో చూస్తాను'' అని చీదరించుకుంది 'మనూ.'

మొదటిసారి అది నేను శచిని తలచుకొని కన్నీరు కార్చడం. అప్పటినుంచీ నా జీవితమే కన్నీటిమయమయింది. శచికి నేను అన్యాయం చేశాను. శచి ఈనాడు కనపడితే నా కన్నీటితో తన పాదాలు కడగాలని, జోలిపట్టి క్షమాభిక్ష వేడాలని ఉంది. కాని ఆ శచి ఇప్పుడు లేదు.

కాని శచి వ్రాసిన ఆ వాక్యాలు ఇప్పుడు నా ఎదుట ఉన్నాయి. శచీ, నన్ను క్షమించు.

"నేను మీ కెవరో కాని, మీరు నా కెన్నడైనా కావలసినవారే.

మీ
శచిదేవి.''

నేను నీ కెవర్నోకాదు, శచీ. నేను నీవాణ్ణే. ఆ లోకంలోనన్నా నిన్ను చేరుకుంటాను శచీ. ఆ లోకంలోనన్నా నిన్ను చేరుకుంటాను.

కాని అక్కడైనా శచిని చూడగానే ఈ చంచల హృదయం.......ఏమో?

ఇక ఈ పాపికి నిష్కృతి లేదేమో! ★



కొలను గట్టున చిత్రం—బి. ఎస్. నారాయణ (వెల్లటూరు)